
సాక్షి
ప్రకాశం
బుధవారం । 11 । డిసెంబర్ । 2024



జిల్లాలో వెయ్యి కోట్ల విద్యుత్ బకాయిలు

జిల్లాలో రూ.వెయ్యి కోట విద్యుత్ బకాయిలు ఉన్నాయని ఎస్ఈ వెంకటేశ్వర్లు తెలిపారు. - 10లో..



సాగర్ @ 70 ఏళ్లు!

జిల్లాలో లక్షలాది ఎకరాలు సాగర్ జలాలతో సస్యశ్యామలమయ్యాయి. సాగర్ డ్యాంకు 1955 డిసెంబర్ 10న శంకుస్థాపన చేశారు. 70వ వసంతంలోకి అడుగుపెట్టింది. - 10లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31/24

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాతావరణంలో తేమ శాతం అధికం. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కూటమి సర్కార్‌పై నిరసన గళం వినిపిద్దాం

- 13న జరిగే ర్యాలీకి రైతన్నలు తరలి రండి
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: ప్రజలను దగాచేస్తున్న కూటమి సర్కార్‌పై నిరసన గళం వినిపించేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 13వ తేదీ ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయం వద్దకు రైతులు తరలిరావాలని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మంగళవారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రైతులతో పెద్ద ఎత్తున ర్యాలీ, కలెక్టర్‌కు విజ్ఞాపన పత్రం అందజేస్తామన్నారు. తక్షణమే రైతుకు పెట్టుబడి సాయం ఏడాదికి రూ.20 వేలు ఇవ్వాలని, సూపర్ సిక్స్ హామీ కూటమి ప్రభుత్వం అమలు చేయాలని, ధాన్యానికి మద్దతు ధర ఇవ్వాలని, దళారి వ్యవస్థను తొలగించాలని, తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, తేమ లెక్కలతో రైతులను ఇబ్బంది పెట్టడం మానుకోవాలని, ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలని, రైతుపై అదనపు భారం మోపే చర్యలు మానుకోవాలన్న డిమాండ్‌లతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ ర్యాలీ, విజ్ఞాపన పత్రం అందజేసే కార్యక్రమాల్లో జిల్లాలో ఉన్న వైఎస్సార్ సీపీ నాయకులు, రైతులు, రైతు సంఘాల నాయకులు భారీ ఎత్తున పాల్గొని కూటమి సర్కార్ తలలు వంచేలా నిరసన గళం వినిపిద్దామని అన్నారు.

మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి

- ఏకేయూ వీసీ ప్రొఫెసర్ మూర్తి



ఒంగోలు సిటీ: మానవ హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆంధ్రకేసరి యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ మూర్తి అన్నారు. ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్సిటీ సెమినార్ హాల్‌లో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజమోహనరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ మూర్తి మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. మానవ హక్కుల ఉల్లంఘన జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఆంధ్రకేసరి యూనివర్సిటీ వైస్ ప్రిన్సిపాల్ నిర్మలా మణి, ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మండే హర్షప్రీతందేవ్ కుమార్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పాలేరుపై ఇసుక తోడేళ్లు



ఉప్పలదిన్నె సమీపంలోని పాలేరు నుంచి టన్నుల కొద్ది ఇసుకను తరలించడంతో ఏర్పడిన భారీ గుంత

కూటమి ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్నామని చెబుతున్న ఇసుక టీడీపీ నేతలకు ప్రధాన ఆదాయ వనరుగా మారింది. ఆపార్టీ ముఖ్య ప్రజాప్రతినిధుల అండదండలతో స్థానిక పచ్చదండు ఇసుకాసురుల అవతారమెత్తారు. విచ్చలవిడిగా వాగులు, వంకలు తవ్వేస్తూ టన్నుల కొద్దీ ఇసుకను రేయింబవళ్లు అక్రమంగా తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఈ ఇసుక దందాను అడ్డుకునేందుకు ప్రయత్నించే వారిపై పోలీసుల చేతే బెదిరింపులకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.

- వేంపాడు, ఉప్పలదిన్నె, రావులకొల్లు కేంద్రంగా ఇసుక దందా
- టీడీపీ ముఖ్యనేతల కనుసన్నల్లోనే అక్రమ రవాణా
- పాలేరు నుంచి సుదూర ప్రాంతాలకు ఇసుక తరలించి జేబులు నింపుకుంటున్న వైనం
- స్థానికులు అడ్డుకొని ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు, అధికారులు
- అక్రమ ఇసుక రవాణా అడ్డుకున్న వారిని ఫొటోలు తీసి కేసులు బనాయిస్తామని హెచ్చరిక
- పాలేరు కేంద్రంగా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతున్న ఇసుక దందా

పొన్నలూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానం టీడీపీ నాయకులు, ఆ పార్టీ ప్రజాప్రతినిధులకు కల్పతరువుగా మారింది. టీడీపీ నాయకుల బెదిరింపులు, నగదు చెల్లించి ఇసుక తీసుకుపోవాలని ఆదేశాలు, అక్రమ ఇసుక రవాణాతో ఇసుక దొరకడం గగనంగా మారింది. వాస్తవంగా కొండపి నియోజకవర్గంలోని పొన్నలూరు, మర్రిపూడి, జరుగుమల్లి, సింగరాయకొండ, టంగుటూరు మండలాల్లో పాలేరు నది పరివాహక గ్రామాలు ఉన్నాయి. పాలేరులో చాలా వరకు నాణ్యమైన ఇసుక లభిస్తుంది. అయితే పాలేరు నదిలో ఎలాంటి ఇసుక రీచ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. దీంతో ఇదే అదునుగా తెలుగు తమ్ముళ్లు ఇసుక మాఫియాకు తెర తీశారు. ముఖ్యంగా పొన్నలూరు మండలంలోని పాలేరు నదికి సమీపంలో వేంపాడు, ఉప్పలదిన్నె, ముప్పాళ్ల, చెన్నిపాడు, రావులకొల్లు, బాలిరెడ్డిపాలెం, కొత్తపాలెం, పరుచూరివారిపాలెం గ్రామాలు ఉన్నాయి. వేంపాడు, ఉప్పలదిన్నె, ముప్పాళ్ల, రావులకొల్లు గ్రామాల్లో నాణ్యమైన ఇసుక దొరుకుతుంది. ఈ గ్రామాల్లో ఇసుక రీచ్ ఏర్పాటు చేయకపోవడంతో అధికారపార్టీ నాయకులు అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతున్నారు. అనుమతులు లేకపోయినా పాలేరు పరీవాహక గ్రామాల నుంచి యథేచ్ఛగా అధికార బలంతో తవ్వకాలు జరుపుతూ చుట్టు పక్కల మండలాలకు లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లతో రవాణా చేస్తూ లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. చుట్టు పక్కల మండలాలైన కనిగిరి, మార్కాపురం, మర్రిపూడి, దర్శి, కందుకూరు, పొదిలి వంటి ప్రాంతాలకు ఆయా గ్రామాల దూరాన్ని బట్టి లారీ ఇసుక ధర సుమారుగా రూ.20 నుంచి రూ.30 వేలు, టిప్పర్ ఇసుక ధర రూ.10 నుంచి రూ.15 వేలు, ట్రాక్టర్ ఇసుక ధర రూ.6 నుంచి రూ.8 వేల వరకు ఉన్నట్లు సమాచారం. నిత్యం 20కిపైగా లారీలు, 20 ట్రక్కుల్లో ఇసుక తరలిస్తున్నారు.



పాలేరు నుంచి పదుల సంఖ్యలో లారీలతో ఇసుక తరలిస్తున్న అక్రమార్కులు

టీడీపీ ముఖ్య నేతల కనుసన్నల్లోనే...

మొదట్లో అక్రమ ఇసుక రవాణా చేయడానికి సాహసించని స్థానిక టీడీపీ నాయకులు, ఆ తరువాత నియోజకవర్గ టీడీపీ ముఖ్య ప్రజాప్రతినిధి, మరో ముఖ్య నేత ఆదేశాలతో ముందడుగు వేశారు. ఏ సమస్య వచ్చినా మేము చూసుకుంటామని, మీ జోలికి ఏ పోలీస్, మైనింగ్ అధికారులు రారని, ఒక వేళ అక్రమ ఇసుక రవాణా సమయంలో వాహనాలను పట్టుకుంటే మేము చూసుకుంటామని వారు వాగ్దానం చేసినట్లు టీడీపీ నాయకులే బహిరంగంగా చెప్పుకుంటున్నారు. దీంతో టీడీపీ నాయకులు అధికారం మనది మనల్ని ఆపేది ఎవడ్రా అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా పాలేరు నదికి సమీప జరుగుమల్లి మండలానికి చెందిన టీడీపీ నాయకుడు, పొన్నలూరు మండలానికి చెందిన నాయకుడు వీరిద్దరి పర్యవేక్షణలో ఈ అక్రమ ఇసుక దందా జరుగుతున్నట్లు సమాచారం. పగలు, రాత్రి తేడా లేకుండా పెద్ద పెద్ద లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్ల తో నిరంతరం టన్నుల కొద్దీ ఇసుకను గుట్టుచప్పుడు కాకుండా చుట్టు పక్కల గ్రామాలకు తరలిస్తున్నారు. అక్రమ ఇసుక రవాణాలో వచ్చే డబ్బుల్లో కొంత మేర ఇసుక దందాను ప్రోత్సహిస్తున్న ముఖ్యమైన ప్రజాప్రతినిధులకు ముట్టచెబుతున్నట్లు ప్రజల్లో చర్చ నడుస్తోంది. వారి అండదండలతోనే తెలుగు తమ్ముళ్లు విచ్చలవిడిగా అక్రమాలకు పాల్పడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.



వేంపాడు సమీపంలోని పాలేరులో రాత్రి సమయంలో ఇసుకను తరలిస్తున్నవారిని అడ్డుకుంటున్న గ్రామస్తులు



వేంపాడు సమీపంలోని పాలేరు లో జేసీబీతో ఇసుక నింపుతున్న దృశ్యం

వ్యాపారంగా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటాం



మండల పరిధిలోని పాలేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే ఎంతటి వారైనా సరే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం గృహ అవసరాలకు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను ఉచితంగా తీసుకెళ్లవచ్చు. కానీ వ్యాపారంగా లారీలు, టిప్పర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తాం. అలాగే వాహనాలను కూడా సీజ్ చేస్తాం.

– పుల్లారావు, తహసీల్దార్, పొన్నలూరు

చోద్యం చూస్తున్నారు...

ఉచిత ఇసుక మాటున ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే ఎంతటి వారైన సరే కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రతి సభలు, సమావేశాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారు. అయితే క్షేత్ర స్థాయిలో అవేవీ అమలు కావడం లేదు. పట్టించుకోవాల్సిన వారు ప్రేక్షకపాత్ర వహిస్తుండటంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. దీనికి తోడు అక్రమాలను అడ్డుకోవాల్సిన అధికారులు ప్రజాప్రతినిధుల ఆదేశాలతో తమ విధులను మరిచిపోతున్నారు. అధికారులు పూర్తిగా పట్టించుకోకపోవడంతో తమ అక్రమాలకు అడ్డేలేదని అక్రమార్కులు మరింతగా ముందుకుపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ ఇసుక దందాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అడ్డుకున్న వారిపై అక్రమ కేసులకు యత్నం..

రెండు నెలలుగా పాలేరు సమీపంలోని వేంపాడు, ఉప్పలదిన్నె, రావులకొల్లు, ముప్పాళ్ల, జరుగుమల్లి మండలం చతుకుపాడు, బిట్రగుంట, జనార్ధనపురంతో పాటు పలు పాలేరు నది పరివాహక గ్రామాల నుంచి అక్రమ ఇసుక రవాణా జరుగుతోంది. ఈ నేపథ్యంలో వేంపాడు, చతుకుపాడు గ్రామాలకు చెందిన కొందరు గ్రామస్తులు ఆ మధ్య కాలంలో తెలుగు తమ్ముళ్ల అక్రమ ఇసుక దందాను అడ్డుకుని స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి వెళ్లిన పోలీసులకు టీడీపీ ముఖ్య నేతలిద్దరి నుంచి ఆదేశాలు రావడంతో ఎలాంటి చర్యలు తీసుకోకుండా మిన్నకుండిపోయారు. పోలీసులు అంతటితో ఆగకుండా అక్రమ ఇసుక రవాణాను అడ్డుకున్న గ్రామస్తుల ఫొటోలు, వీడియోలు తీసి మీపై కేసులు బనాయిస్తామని హెచ్చరించడం కొసమెరుపు. దీంతో పట్టించుకోవాల్సిన వారే అక్రమార్కుల పంచన చేరి అక్రమ కేసులు పెడతామని బెదిరించడంతో ఆయా గ్రామాల ప్రజలు చేసేదేమీలేక అక్కడ నుంచి వెళ్లిపోయినట్లు చెబుతున్నారు. ఈ అక్రమ ఇసుక దందాలో పోలీసులు, అధికారుల పాత్ర కూడా ఉందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

భిక్షాటన చేస్తూ నిరసన



భిక్షాటన చేసుకుంటున్న నగర పాలక సంస్థలో తొలగించిన మేస్త్రీలు



శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ పిచ్చయ్య ఛాంబర్‌లో ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలుపుతూ..

- మేస్త్రీలుగా కొనసాగించాలని పారిశుద్ధ్య కార్మికుల నిరసన, ధర్నా
- తమ కడుపులు కొడుతున్నారంటూ ఆందోళన

ఒంగోలు సబర్బన్: పారిశుద్ధ్య విభాగంలో పని చేస్తున్న మేస్త్రీలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఒంగోలు నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద కార్మికులు, మేస్త్రీలు భిక్షాటన చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 36 రోజుల నుంచి పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న కార్మికులు తమను విధుల్లో తీసుకోవాలని నిరసన కార్యక్రమం చేస్తూనే ఉన్నారు. ఈ సందర్భంగా యూనియన్ నగర గౌరవ అధ్యక్షుడు బి.మహేష్ మాట్లాడుతూ 15 సంవత్సరాల నుంచి విధులు నిర్వహిస్తున్నామన్నారు. కాంగ్రెస్, టీడీపీ, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పారిశుద్ధ్య విభాగంలో మేస్త్రీలుగా కొనసాగామని, అదేవిధంగా విధులు నిర్వహించే సందర్భంలో ప్రజల నుంచి, కార్మికుల నుంచి నేటికీ ఎలాంటి సమస్యలు రాలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే ఒంగోలు కార్పొరేషన్‌లో వివిధ విభాగాల్లో కార్మికుల్ని, పారిశుద్ధ్య విభాగంలో మేస్త్రీలను తొలగించిందన్నారు. నిజంగా మస్టర్ రాకుండా వేతనాలు తీసుకున్న కార్మికులపై చర్యలు తీసుకోవాలని, అంతేకానీ అందరినీ తొలగించడం తగదని అన్నారు. శానిటేషన్ సూపర్‌వైజర్ ఎస్.పిచ్చయ్య చాంబర్‌లో ప్ల కార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు కే ఆదినారాయణ, సీహెచ్ వెంకటేశ్వర్లు, టీ వెంకట్రావు, బీ బాలకృష్ణ, శ్యామ్ గణేష్, రవి, ప్రశాంత్, పీ విజయ వర్ధన్, అనిల్, రమేష్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి హనీఫ్

ఒంగోలు టౌన్: ఈ నెల 13, 14, 15 తేదీల్లో చీమకుర్తిలో మూడు రోజుల పాటు జరగనున్న జిల్లా సీపీఎం మహాసభలకు జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ పిలుపునిచ్చారు. స్థానిక సుందరయ్య భవనంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మూడేళ్లకోసారి నిర్వహించే జిల్లా మహాసభలను ఈ సారి చీమకుర్తిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. తొలిరోజు చీమకుర్తి ఆర్టీసీ బస్టాండు నుంచి ర్యాలీ, అనంతరం బహిరంగ సభ నిర్వహిస్తారన్నారు. 14, 15 తేదీల్లో జరిగే ప్రతినిధుల సభలో జిల్లాలోని ప్రధాన సమస్యలను చర్చించనున్నామన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.10 వేల కోట్ల ప్యాకేజీని కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇందు కోసం ఎమ్మెల్యేలంతా కలిసి ముఖ్యమంత్రి మీద ఒత్తిడి తీసుకొచ్చి నిధులు మంజూరు చేయించాలని చెప్పారు. కనిగిరిలో నిమ్జ్, దొనకొండ పారిశ్రామిక కారిడార్ సాధనకు పోరాటాలు చేస్తామని తెలిపారు. పాలకులు పశ్చిమ ప్రకాశాన్ని నిర్లక్ష్యం చేయడంతో వలసలు ఎక్కువయ్యాయన్నారు. జిల్లాలో ప్రస్తుతం వ్యాపార సంస్థలకు స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారని, తరువాత నివాస గృహాలకు బిగిస్తారని, విద్యుత్ నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ కుట్రలను ప్రజలు దీటుగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా నాయకులు కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, ఎస్కే మాబు, జీవీ కొండారెడ్డి, పూనాటి ఆంజనేయులు పాల్గొన్నారు.

బీఎస్సీ నర్సింగ్ చేసిన వారికి సౌదీలో ఉద్యోగ అవకాశాలు

ఒంగోలు వన్‌టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓఎంసీఏపీ, ఆల్ యూసఫ్ ఎంటర్‌ప్రైజెస్ సంయుక్త ఆధ్వర్యంలో బీఎస్సీ నర్సింగ్, పోస్టు బీఎస్సీ నర్సింగ్ విద్య పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు సౌదీ అరేబియా దేశంలోని రిహాబిలిటేషన్ సెంటర్లలో ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి జే రవితేజయాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 15వ తేదీ లోపు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులకు 18వ తేదీ ప్రీ అసెస్మెంట్ నిర్వహిస్తారన్నారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 40 ఏళ్ల మధ్య ఉండాలని, కనీసం ఒకటిన్నర సంవత్సరం హాస్పిటల్‌లో పని చేసిన అనుభవం ఉండాలన్నారు. అభ్యర్థులు సౌదీ అరేబియా దేశంలో పని చేయడానికి సిద్ధంగా ఉండాలని చెప్పారు. రిజిస్ట్రేషన్ రుసుం రూ.37 వేలు, జీఎస్టీ ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థుల వీసా రుసుం, సౌదీ రాను, పోను విమాన టికెట్లు ఆల్ యూసఫ్ ఎంటర్ ప్రైజెస్ వారు అభ్యర్థులు కట్టిన రుసుం నుంచే చెల్లిస్తారన్నారు. ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థులకు భారత కరెన్సీలో నెలకు రూ.78 వేల నుంచి రూ.89 వేల వరకూ వేతనం ఉంటుందని తెలిపారు. అభ్యర్థుల బయోడేటా, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, పాస్ పోర్టు, ట్రాన్సిట్ ధ్రువీకరణ పత్రం, జనన, అనుభవ, వివాహ ధ్రువీకరణ పత్రం, నోటరీ లెటర్, నర్సింగ్ కౌన్సిల్ ధ్రువీకరణ పత్రం, కోవిడ్, ఎంఎంఆర్ పరీక్షల పత్రాలను జతపరచాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులకు నర్సింగ్ పరిజ్ఞానం, ప్రాథమిక ఇంగ్లిషు, డిజిటల్ నైపుణ్యాల్లో ప్రాథమిక పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షలో అర్హత పొందిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తారన్నారు. 9988853335 అనే నంబరుకు ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు.

అగ్రిగోల్డ్ జామాయిల్ తోటలను పరిశీలించిన సీఐడీ



నరికివేతకు గురైన జామాయిల్ చెట్లను పరిశీలిస్తున్న సీఐడీ సీఐ తిరుమలరావు, రెవెన్యూ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

సీఎస్‌పురం(పామూరు): సీఎస్‌పురం మండలంలోని రాజుపాలెం వద్ద 210/4, 210/3, 210/2 సర్వేనంబర్లలో అగ్రిగోల్డ్‌కు చెందిన భూముల్లోని రూ.లక్షల విలువచేసే జామాయిల్ చెట్లను టీడీపీకి చెందిన వారు అక్రమంగా నరికి తరలిస్తున్నారు. దీనిపై ఈనెల 9వ తేదీ 'సాక్షి' దినపత్రికలో 'అగ్రిగోల్డ్ భూముల్లో పచ్చదొంగలు' అన్న శీర్షికన ప్రచురితమైన కథనానికి సీఐడీ, స్థానిక రెవెన్యూ సిబ్బంది స్పందించారు. మంగళవారం సీఐడీ సీఐ తిరుమలరావు, సీఎస్‌పురం తహసీల్దార్ డి.మంజునాథరెడ్డిలు అగ్రిగోల్డ్ భూముల్లో నరికివేతకు గురైన జామాయిల్ తోటలను పరిశీలించారు. భూములపై వీఆర్‌ఓ బి.మాల్యాద్రి, సర్వేయర్ సుప్రియను సర్వేనంబర్లు, ఇతర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా వారు అగ్రిగోల్డ్ భూముల్లో జామాయిల్ చెట్లను నరికిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరైనా అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రికార్డుల పరంగా వివరాలు తీసుకుని బాధ్యులపై కేసులకు సిఫారసు చేయనున్నట్లు సీఐడీ సీఐ పేర్కొన్నట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో వారి వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

జిల్లాలో 70,817 హెక్టార్లలో కంది పంట

● నాఫెడ్‌ద్వారా కంది కొనుగోళ్లు ● జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ



కంది పంట కొనుగోలుపై సమావేశం నిర్వహిస్తున్న జేసీ గోపాలకృష్ణ


ఒంగోలు అర్బన్: జిల్లాలో 70,817 హెక్టార్లలో 73,091 మంది రైతులు కంది పంటను ఈ క్రాప్‌లో నమోదు చేసుకున్నట్లు జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ తెలిపారు. ప్రకాశంభవనంలో కంది పంట కొనుగోలుపై మంగళవారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఖరీఫ్–2024 కంది పంట ఉత్పత్తులను నాఫెడ్ ఆధ్వర్యంలో మార్కెట్ ధర ప్రకారం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ఈ–క్రాప్‌లో నమోదు చేసుకున్న రైతులందరి నుంచి నూరుశాతం పంటను కొనుగోలు చేస్తామన్నారు. రైతులు డిసెంబర్ 12వ తేది నుంచి రైతు సేవా కేంద్రాల్లో వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏల ద్వారా సీఎంయాప్‌లో పంట వివరాలను నమోదు చేసుకునేలా చూడాలన్నారు. రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం ద్వారా ఎక్కువ లాభపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. కంది రైతులు పేర్లు నమోదు చేసుకునే సమయంలో పంట నూర్పిడి తేదీని కూడా నమోదు చేయాలన్నారు. దాని వల్ల సరుకు అమ్ముకునే తేది రిజిస్టర్ మొబైల్ నంబర్‌కు మెసేజ్ వస్తుందని తెలిపారు. రైతులకు వారి డబ్బు ఆధార్‌తో అనుసంధానమైన బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని పేర్కొన్నారు. రైతులు మొబైల్ నంబర్ ఆధార్, బ్యాంక్ ఖాతాకు లింక్ అయిందో లేదో సరిచూసుకునేలా తెలియచేయాలన్నారు. రైతులు పంటను శుభ్రపరుచుకుని అరబెట్టుకుని తేమశాతం 12శాతం లోపు ఉండి ప్రభుత్వం సూచించిన నాణ్యతా ప్రమాణాలు ఉండేలా చూడాలన్నారు. రైతులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నష్టపోకుండా ఉండేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో సివిల్ సప్లయిస్, వ్యవసాయ శాఖ, నాఫెడ్ అధికారులు పాల్గొన్నారు.

సాగర్ నీళ్లు @ 70 ఏళ్లు!

చీమకుర్తి:

ప్రకాశం జిల్లాలో లక్షలాది ఎకరాల భూములు సాగర్ జలాలతో సస్యశ్యామలమయ్యాయి. నాగార్జున సాగర్ డ్యామ్‌కు 1955 డిసెంబర్ 10వ తేదీన ఆనాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ శంకుస్థాపన చేయగా నేడు 70వ వసంతంలోకి అడుగు పెట్టింది. సాగర్ డ్యామ్‌లో నిల్వ చేసిన నీటిని కుడి, ఎడమ కాలువల ద్వారా దేశ మూడో ప్రధాని ఇందిరాగాంధీ 1967లో తొలిసారి ఆయకట్టుకు విడుదల చేశారు. కుడి కాలువకు జవహర్‌లాల్ నెహ్రూ, ఎడమ కాలువకు రెండో ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి పేర్లు పెట్టారు. కుడి కాలువ గుంటూరు, ప్రకాశం జిల్లాల గుండా 203 కి.మీ మేర ప్రయాణిస్తూ 11.74 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరిస్తోంది.

- 1955 డిసెంబర్ 10న నందికొండ ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన
- స్థల ప్రాశస్త్యాన్ని బట్టి నాగార్జున సాగర్‌గా పేరు మార్పు
- 1967లో ఇందిరాగాంధీ చేతులమీదుగా కుడి, ఎడమ కాలువలకు నీటి విడుదల
- ప్రకాశంలో 4.43 లక్షల ఎకరాలకు కుడి కాలువ నీరు
- జిల్లాలోని 85/3 మైలు వద్ద 3,346 క్యూసెక్కులతో జిల్లాలోకి సాగర్ జలాల ప్రవేశం
- పుల్లలచెరువు మండలం ముటుకుల నుంచి ఒంగోలు మండలం కొప్పోలు వరకు కుడి కాలువ ప్రయాణం
- రామతీర్థం, గుండ్లకమ్మ రిజర్వాయర్లు నిర్మించి సాగర్ నీటిని మరింత చేరువ చేసిన వైఎస్సార్
- వైఎస్సార్, వైఎస్ జగన్ పాలనలో పుష్కలంగా సాగర్ జలాలు



చీమకుర్తి మీదుగా ప్రవహిస్తున్న సాగర్ కుడి కాలువ

నదుల చెంతనే నాగరికత విలసిల్లిందని చరిత్ర చెబుతోంది. నది నీరు పారిన చోటా అభివృద్ధి వికసిస్తుందని 'నాగార్జున సాగర్' నిరూపించింది. కరువు కాటకాలతో ఎడారిని తలపించే ప్రకాశం జిల్లా భూములకు నాగార్జున సాగర్ జలాలు జీవం పోశాయి. తడారిపోతూ నిత్యం ఘోషిస్తున్న లక్షలాది గొంతుకల దప్పిక తీర్చాయి. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఆధ్వర్యంలో పురుడు పోసుకున్న ఈ ప్రాజెక్టును రూ.73 కోట్లతో నిర్మించతలపెట్టగా.. 45 వేల మంది కార్మికులు పుష్కర కాలం చెమటోడ్చారు.

ప్రకాశంలో సాగర్ జలాల సవ్వడి

సాగర్ ప్రధాన కుడి కాలువ జిల్లాలోని యర్రగొండపాలెం నియోజకవర్గం పుల్లలచెరువు మండలం ముటుకుల సమీపంలో 85/3వ మైలు వద్ద ప్రారంభమై కురిచేడు వద్ద రెడ్డి సాగర్ ప్రాంతంలో 126వ మైలు వద్ద ముగుస్తుంది. అయితే ప్రధాన కాలువ నుంచి మేజర్, మైనర్ కాలువల ద్వారా ఒంగోలు మండలం కొప్పోలు వరకు సాగర్ నీరు ప్రయాణం చేస్తున్నాయి. సాగర్ డ్యామ్ కుడి కాలువ 11 వేల క్యూసెక్కులతో ప్రారంభమై జిల్లాలోని 85/3వ మైలు వద్దకు వచ్చేసరికి 3,346 క్యూసెక్కుల నీటితో ప్రకాశం జిల్లాలోకి ప్రవేశిస్తున్నాయి.




రామతీర్థం నుంచి వందలాది గ్రామాలకు నీరందిస్తున్న పథకం


జిల్లాలో 4.43 లక్షల ఎకరాల ఆయకట్టు

జిల్లాలో సాగర్ కుడి కాలువ పరిధిలో 4.43 ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. జిల్లాకే తలమానికంగా నిలిచిన రామతీర్థం, గుండ్లకమ్మ రిజర్వాయర్లకు సాగర్ నీరే ఆధారం. రామతీర్థం రిజర్వాయర్‌తో 70 వేల ఎకరాల ఆయకట్టు, గుండ్లకమ్మ ప్రాజెక్ట్ పరిధిలో 80 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించే లక్ష్యంతో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని 2008, 2009లో రెండు ప్రాజెక్టులను నిర్మించి ప్రజలకు అంకితం చేశారు. దాంతోపాటు రామతీర్థం రిజర్వాయర్ ద్వారా ఒంగోలు కార్పొరేషన్‌లోని దాదాపు 2 లక్షల మంది ప్రజలకు, కందుకూరు పట్టణంలోని లక్ష మంది ప్రజలకు, తాళ్లూరు, చీమకుర్తి, చీమకుర్తి, సీఎస్ పురం, కనిగిరి ప్రాంత వాసులకు సాగర్ నీటిని అందించే ఏర్పాట్లు చేశారు. గుండ్లకమ్మ ప్రాజెక్ట్‌లోకి వచ్చే ప్రవాహంలో 50 శాతానికి పైగా నీరు.. సాగర్ జలాలతో స్థిరీకరణ పొందిన పొలాల నుంచి రీజనరేట్ అయినవే కావడంతో ఆ ప్రాజెక్ట్ ఏడాది పొడవునా నిండుకుండలా తొణికిసలాడుతోంది.

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగించిన 2019–24 మధ్య కాలంలో నాగార్జున సాగర్ కుడి కాలువ ద్వారా జిల్లాకు సరాసరిన ఏడాది మొత్తంలో 68 వేల క్యూసెక్కుల నీటిని అందించారు. వైఎస్ జగన్ హయాంలో ఏడాదిలో 7 నెలలపాటు సాగర్ కుడి కాలువ ప్రవహించడంతో పంటల సాగు, తాగునీటికి కొరత లేకుండా జిల్లా వాసులకు ఎంతో మేలు జరిగింది.



రామతీర్థం రిజర్వాయర్



గుండ్లకమ్మ ప్రాజెక్ట్

ముటుకుల వద్ద కుడి కాలువ జలాలు ప్రారంభం

నాగార్జున సాగర్ డ్యామ్ నుంచి వచ్చే జవహర్‌లాల్ నెహ్రూ కుడి కాలువ ప్రకాశం జిల్లాలోని పుల్లలచెరువు మండలం ముటుకుల వద్ద మొదలవుతుంది. డ్యామ్ వద్ద 11 వేల క్యూసెక్కులు కుడి కాలువకు విడుదల చేస్తుండగా, జిల్లాలోకి వచ్చేసరికి 3,346 క్యూసెక్కులతో ప్రారంభమవుతుంది. రెడ్డి సాగర్ వద్ద కుడి కాలువ ముగిసినా దానికి సంబంధించిన మేజర్ల ద్వారా ఒంగోలు శివారు ప్రాంతాల వరకు సాగర్ జలాలు ప్రయాణిస్తున్నాయి.

– కె.శివనాగరాజు, డీఈ, గుండ్లకమ్మ ప్రాజెక్ట్

జిల్లాలో రూ.వెయ్యికోట్ల విద్యుత్ బకాయిలు

● బకాయిల వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్
● విద్యుత్ ఎస్ఈ వెంకటేశ్వర్లు వెల్లడి



మాట్లాడుతున్న ఎస్ఈ వెంకటేశ్వర్లు

మార్కాపురం: జిల్లాలో రూ.వెయ్యికోట్ల విద్యుత్ బకాయిలు ఉన్నాయని, వీటి వసూళ్లకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్‌శాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు తెలిపారు. మార్కాపురం విద్యుత్‌శాఖ గెస్టుహౌస్‌లో మంగళవారం రాత్రి ఏర్పాటుచేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ శాఖలకు సంబంధించి రూ.650 కోట్లు, ప్రైవేట్ బకాయిలు రూ.350 కోట్లు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపాలిటీలు, వ్యవసాయ, రెవెన్యూ తదితర శాఖల బకాయిలు ఉన్నాయని, ప్రైవేటు శాఖలకు సంబంధించి పరిశ్రమలు, గృహ విద్యుత్ వినియోగదారుల బకాయిలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వశాఖల బకాయిల గురించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఆయాశాఖల హెచ్‌ఓడీలు కూడా బకాయిల వివరాలు అందించి చెల్లించాలని చెప్పామన్నారు. జిల్లాకు ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన కింద 8వేల కనెక్షన్లు మంజూరయ్యాయని, 300యూనిట్లు ఆపైన వినియోగదారులకు ఈ పథకం చాలా ఉపయోగమని, ప్రభుత్వం కూడా సబ్సిడీ ఇస్తుందన్నారు.

8 సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు..

జిల్లాలో 8 సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపినట్లు ఎస్ఈ వెంకటేశ్వర్లు తెలిపారు. ఒంగోలులోని హౌసింగ్ కాలనీ, రాజీవ్‌నగర్, క్లోపేట, గిద్దలూరు నియోజకవర్గంలోని కాసనపల్లి, కొండేపి నియోజకవర్గంలోని తూర్పునాయుడుపాలెం, దర్శి నియోజకవర్గంలోని కల్లూరు, మార్కాపురం నియోజకవర్గంలోని పొదిలి మండలంలోని ఏలూరు, కందుకూరు నియోజకవర్గంలోని మన్నేటికోట తదితర ప్రాంతాల్లో 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ఏర్పాటు చేస్తామని అన్నారు. ఆర్‌డీఎస్ పథకం కింద ఉమ్మడిజిల్లాకు రూ.839 కోట్లు, ఇందులో ప్రకాశంజిల్లాకు రూ.600 కోట్లు నిధులు మంజూరయ్యాయని అన్నారు. వీటి ద్వారా గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు ప్రత్యేకంగా త్రిఫేజ్, పరిశ్రమలకు, గృహ అవసరాలకు త్రిఫేజ్ విద్యుత్ సరఫరా అందిస్తామన్నారు. మార్కాపురం డివిజన్‌లో విద్యుత్ బకాయిల పెండింగ్‌లపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఆదేశించామన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా లైన్‌మన్లు, ఇన్‌స్పెక్టర్లు, ఏఈలు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, నివారణ, ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్స్‌పై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని, అంతరాయం తొలగించాలని ఆదేశించామన్నారు. ఈఈ నాగేశ్వరరావు, డీఈ షియానాయక్, ఏఈ నాగేంద్రరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నను రైలు ఎక్కించేందుకు వెళ్తూ అనంతలోకాలకు..

● పొగమంచు కారణంగా డివైడర్‌ను ఢీకొన్న బైక్



మృతి చెందిన యశ్విన్



యశ్విన్ (ఫైల్)

మార్కాపురం రూరల్: అన్నను రైలు ఎక్కించేందుకు వెళ్తూ ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి కిందపడి ఓ విద్యార్థి మృతి చెందిన సంఘటన మంగళవారం ఉదయం మార్కాపురం రైల్వేస్టేషన్ ఓవర్ బ్రిడ్జిపై చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. మార్కాపురం పట్టణంలోని పూలసుబ్బయ్య కాలనీకి చెందిన చిలక రాజు, జ్యోతి దంపతులకు కార్తీక్, యశ్విన్ కుమారులు. కార్తీక్ గుంటూరులో ఇంజినీరింగ్, యశ్విన్ స్థానిక వాసవీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. మంగళవారం ఉదయం కార్తీక్ కళాశాలకు వెళ్లాల్సి ఉంది. ఈ నేపథ్యంలో తనను బైక్‌పై రైల్వేస్టేషన్‌లో దింపాల్సిందిగా తమ్ముడు యశ్విన్‌ను కోరాడు. రైల్వే బ్రిడ్జి వద్ద దట్టమైన పొగమంచులో ఎదురుగా ఉన్న డివైడర్‌ను ఢీకొట్టడంతో బైక్‌పై వెనుక కూర్చున్న యశ్విన్(16) కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న కార్తీక్‌కు గాయాలయ్యాయి. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మార్కాపురం రూరల్ ఎస్సై అంకమరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని మార్కాపురం జీజీహెచ్‌కు తరలించారు.

ఫోర్జరీ కేసులో ఐదుగురికి రిమాండ్

పొదిలి: కొనకనమిట్ల తహసీల్దార్ డిజిటల్ సంతకాన్ని ఫోర్జరీ చేసి రుణం పొందిన కేసులో ఐదుగురు నిందితులను ఎస్సై రాజ్‌కుమార్ మంగళవారం పొదిలి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. వివరాలు.. మండలంలోని నాగంపల్లి గ్రామానికి చెందిన పానుగోటి తిరుపతయ్య, పానుగోటి వెంకటేశ్వర్లు, వెలుగొండరాయునిపల్లి గ్రామానికి చెందిన తోటకూర నారాయణ బ్యాంకు రుణం కోసం భూమికి సంబంధించిన పత్రాలు కావాలని గొట్లగట్టు గ్రామానికి చెందిన ఇంటర్‌నెట్ నిర్వాహకుడు మంత్రి శ్రీను, పొదిలికి చెందిన మీ సేవ నిర్వాహకుడు దివ్వెల సుబ్బారావును సంప్రదించారు. రైతుల వద్ద నుంచి కొంత నగదు తీసుకున్న వీరు.. కొనకనమిట్ల మండలంలో గతంలో డీటీగా పనిచేసిన, ప్రస్తుతం తహసీల్దార్‌గా ఉన్న సురేష్ సంతకాన్ని ఫోర్జరీ చేసి 1–బీ, అడంగల్ కాపీలు ఇచ్చారు. ఈ పత్రాలతో రైతులు గొట్లగట్టు కెనరా బ్యాంకులో రుణం పొందారు. తన సంతకాలను కొందరు ఫోర్జరీ చేసి రుణాలు పొందారనే సమాచారం తహసీల్దార్‌కు చేరింది. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు ఎస్సై రాజ్‌కుమార్ కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం ఐదుగురు నిందితులను పొదిలి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ప్రత్యూష 14 రోజుల రిమాండ్ విధించారు.

ఖైదీల హక్కుల పరిరక్షణకు
న్యాయస్థానాల సహకారం

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి



ఖైదీలకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి

ఒంగోలు టౌన్: ఖైదీలకు అన్ని రకాల హక్కులు కల్పించేందుకు న్యాయస్థానాలు తగిన విధంగా సహకరిస్తాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ. భారతి తెలిపారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా జైలు ఆవరణలో మంగళవారం ఖైదీలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. ఖైదీలు కుటుంబసభ్యులను కలవడానికి ప్రభుత్వం ములాఖత్ సౌకర్యాన్ని కల్పించిందన్నారు. అలాగే ఆహారం, ఇతర మౌళిక సదుపాయాలను కల్పించినట్లు వివరించారు. ఖైదీలకు మానవ హక్కుల గురించి వివరించారు.న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్యాంబాబు మాట్లాడుతూ.. న్యాయసహాయం అవసరమైన ఖైదీలకు ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామన్నారు. జిల్లా జైలులో ఏర్పాటు చేసిన గ్రంథాలయంలో ఎన్నో రకాల మంచి పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లా కారాగారం ఇన్‌చార్జి సూపరింటెడెంట్ వి. రమేష్, జైలు మెడికల్ ఆఫీసర్ కేఎస్‌వీఎస్ బ్రహ్మతేజ, ఎం. శ్రీనివాసరావు, చీఫ్ హెడ్ వార్డర్ కె. అర్జునరావు పాల్గొన్నారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

● అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



ఆత్మహత్య చేసుకున్న సుజాత

కురిచేడు: మండలంలోని దేకనకొండ గ్రామానికి చెందిన కోలుకొండ సుజాత(35)మంగళవారం తన ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె తల్లి బెల్లం గోవిందమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం శివ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎస్సై వివరాల మేరకు..కోలుకొండ సుజాతకు నరసింహారావుతో వివాహమై ఇద్దరు సంతానం ఉన్నారు. నరసింహారావు చెడు అలవాట్లకు లోనై నిత్యం భార్యతో గొడవపడుతుండేవాడు. ఈక్రమంలో సోమవారం రాత్రి ఇద్దరూ గొడవపడి నరసింహారావు తన కుమారుడిని తీసుకుని పొలానికి వెళ్లి రాత్రంతా అక్కడే ఉన్నాడు. దీంతో మనస్తాపం చెందిన సుజాత ఇంట్లో ఎవ్వరూ లేకపోవడంతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఉదయం పొలం నుంచి వచ్చిన నరసింహారావు తలుపు తట్టగా ఎంతకీ తీయకపోవడంతో ఇరుగుపొరుగు వారి సాయంతో తలుపులు తీసి చూడగా సుజాత ఉరేసుకొని కనిపించింది. గోవిందమ్మ ఫిర్యాదు మేరకు మృతదేహానికి దర్శి ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం చేయించి అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

300 బస్తాల
రేషన్ బియ్యం సీజ్



బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ తదితరులు

పొదిలి: మార్కాపురం అడ్డరోడ్డు సమీపంలోని రైస్‌మిల్లులో ఉన్న 300 బస్తాల రేషన్ బియ్యాన్ని సోమవారం రాత్రి సీజ్ చేశారు. ధనలక్ష్మి రైస్ మిల్లులో రేషన్ బియ్యం నిల్వలు ఉన్నాయని కనిగిరి ఆర్‌డీఓ కేశవర్ధన్‌రెడ్డికి సమాచారం వచ్చింది. వెంటనే స్పందించిన ఆయన తమ సిబ్బందితో రాత్రి ఒంటి గంట సమయంలో రైస్‌మిల్లుపై దాడి చేశారు. రేషన్ బియ్యం అని నిర్ధారించుకున్న తరువాత వాటిని సీజ్ చేశారు. సీజ్ చేసిన బియ్యాన్ని స్థానిక పౌరసరఫరాల గోడౌన్‌కు పంపించారు. అక్రమంగా బియ్యం నిల్వ ఉంచిన సురేష్‌పై 6ఏ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కనిగిరి, పొదిలి ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు జి.రమేష్, సురేఖ, ఎఫ్ఐలు ప్రమోద్, శివనాగిరెడ్డి, ఇన్‌చార్జ్ ఆర్ఐ కిలారి సుబ్బారావు, పోలీసులు పాల్గొన్నారు.